క్లుప్తంగా

నేడు 'కొండా' పర్యటన

పెద్దేముల్: బీజేపీ ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం పెద్దేముల్ మండలంలో జరగనుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు హరీశ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 8.30 గంటలకు మంబాపూర్లో ప్రారంభమవుతుందని, ఇందులో చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. కావున యాత్రలో పార్టీ శ్రేణులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చలివేంద్రం ఏర్పాటు

తాండూరు టౌన్: తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో మల్లప్ప మడిగ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. ఎస్‌ఐ కాశీనాథ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. వేసవి కాలంలో బాట సారుల దాహార్తిని తీర్చేందుకు ఎలక్ట్రీషియన్లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సత్యం పటేల్, నంద కుమార్, గుండప్ప, వీరేశం, ఎల్లప్ప, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



వీరనాగమ్మకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

ధారూరు: హరిదాస్‌పల్లి గ్రామంలో బుధవారం వీరనాగమ్మ, బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రథమ పూజ్యుడు మహాగణపతి పూజ అనంతరం గ్రామ దేవతల విగ్రహాలకు ధాన్యాదివాసం, జలాదివాసం, పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను చేపట్టారు.

కొనసాగుతున్న వీధినాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కుల్కచర్ల: స్నేహకళా భజన మండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకం కొనసాగుతోంది. మూడు రోజులుగా వీరబ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్ర ఆధారంగా కళాకారులు నాటకాన్ని ప్రదర్శిస్తుండగా.. వీక్షించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

పోరాట యోధుడు పాపన్న



పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి: పెత్తందారుల గుండెల్లో నిద్రించిన గెరిల్లా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. పాపన్న వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. అనగారిన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని, అన్ని బహుజన వర్గాలను ఏకం చేసిన యోధుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఆత్మగౌరవం కోసం దొరల దౌర్జన్యాలపై పోరాటం చేసి, బహుజన వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, బహుజనుల అభ్యున్నతికి కృషి చేశాడని పేర్కొన్నారు. ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరకాలంగా గుర్తుంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాఘవేందర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రాజు గౌడ్, శ్రీనివాస్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొమ్ము అనంతమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన.. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.

ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని కొండకల్‌లో బుధవారం మల్లన్న, బీరప్ప, పోచమ్మ ఆలయాల నిర్మాణాలకు మాజీ సర్పంచ్ వీరయ్య, ఎంపీటీసీ తాండ్రయ్యలు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని చెప్పారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేసి గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఉదయమోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, కాశీనాథ్, నాయక్, అశోక్, గుత్తి, బాబు, వెంకన్న, మైపాల్, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

తాగునీటి వృథా.. పట్టదా ప్ర'జల' వ్యథ



ఇందూరు జైరాంతండాలో ఆన్‌ఆఫ్ లేని కులాయి

పెద్దేముల్: ఓ వైపు మండే ఎండలతో ఉక్కపోత. మరో వైపు తాగు నీటి కటకట. వెరసి ప్రజలు అల్లాడిపోతుండగా.. కొన్ని ప్రాంతాల్లో నీరు వృథాగా పారుతోంది. తగిన సరఫరా లేని ప్రాంత ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటుండగా.. సమృద్ధిగా పంపిణీ అయ్యే చోట.. అవసరం మేరకు జనం జలం పట్టుకోగా.. అ తరువాతి సమయం వృథా అయి.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మండల పరిధి జైరాంతండా (ఇందూరు), ధారుణివాగుతండాల్లో పై విధంగానే జరుగుతోంది. ఒక చోట పైప్‌లైన్ ఊడిపోగా, మరో చోట ఆన్‌ఆఫ్ లేకుండా నేరుగా నీటి సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి, నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ధారుణివాగుతండాలో పైప్‌లైన్ ఊడి వృథాగా పోతున్న నీరు

ప్రభుత్వ భవనాలకు గ్రహణం

- నిర్మాణంలోనే శిథిలావస్థకు..
- నిధులలేమితో నిలిచిన అతిథి గృహం పనులు
- ఏళ్లు గడిచినా ముందుకు సాగని వైనం
- వినియోగించని ట్రెజరీ భవనం

దోమ: సర్కారు భవనాలకు గ్రహణం పట్టింది. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా సుదీర్ఘకాలం నిర్మాణ పనులు కొనసాగుతూ.. నత్తనడకను సైతం మైమరపిస్తున్నాయి. కొన్ని భవనాలు నిరుపయోగంగా ఉన్నప్పటికీ, మరికొన్ని కొంత మేర నిర్మించి, బడ్జెట్ లేదంటూ నిర్మాణదారులు మధ్యలోనే చేతులు దులుపుకొంటున్న వైనం.. అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది.

అధికారుల నిర్లక్ష్యం

దోమ మండల కేంద్రంలో ఏడు సంవత్సరాల క్రితం జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలతో ఉన్నతాధికారులు బస చేసేందుకు అతిథిగృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉన్న డబ్బులతో సంబంధిత కాంట్రాక్టర్ గోడలు, స్లాబ్ వేశారు. సరిపడా బడ్జెట్ లేదని మిగతా పనులు వదిలేశారు. ట్రెజరీ కోసం ఓ భవనాన్ని నిర్మించి దానినీ నిరుపయోగంగా ఉంచారు. దివ్యాంగుల విశ్రాంతి కోసం.. నాటి ప్రభుత్వం.. ఒక భవనాన్ని నిర్మించ తలపెట్టింది. అందులో భాగంగా.. సంబంధిత అధికారులు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. బెస్‌మెంట్ లెవల్లోనే వదిలేశారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజాధనం అంటే వారికి చులకనై పోయిందంటూ విమర్శించారు. అతిథిగృహ భవన నిర్మాణ పనుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన కరువైందని పలువురు ఆరోపించారు. మరిన్ని నిధులు మంజూరు చేసి, విశ్రాంతి బంగ్లాను వినియోగంలోకి తేవాలని, మిగతా భవనాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.





నిర్మాణ పనులు నిలిచిన అతిథిగృహం (ఇన్‌సెట్‌లో) నిరుపయోగంగా ట్రెజరీ భవనం

ప్రజాధనం వృథా



ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సర్కారు భవనాలు.. అసంపూర్తి పనులతో ఏళ్లుగా దర్శనమిస్తున్నాయి. ట్రెజరీ భవనం నిరుపయోగంగా ఉంది. దివ్యాంగుల కోసం నిర్మించ తలపెట్టిన భవనానికి మోక్షం లేకుండా పోయింది. నిధుల లేమితో ఆగిపోయిన పనులను చేపట్టి, ఆయా భవనాలను పూర్తిచేసి, అన్నింటినీ వినియోగంలోకి తేవాలి.

– రాములు, ఎంపీటీసీ, బొంపల్లి

వినియోగంలోకి తెస్తాం



నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తెస్తాం. ఇప్పటికే వాటిని ఎన్నికల విధులకు ఉపయోగిస్తున్నాం. బడ్జెట్ లేక అర్ధంతరంగా పనులు నిలిచిపోయిన వాటిపై దృష్టి సారిస్తాం. తగిన వివరాలను ఉన్నతాధికారుకు నివేదిస్తాం. నిధులు మంజూరు చేయించి, పనులు పూర్తి అయ్యేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. ఉపయోగంలోకి తెస్తాం.

– మహేశ్‌బాబు, ఎంపీడీఓ, దోమ

నేడు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



జలాదివాసంలో దేవతామూర్తుల విగ్రహాలు

తాండూరు రూరల్: చెంగోల్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం నూతన విగ్రహాలకు అభిషేకం, నిత్య పూర్ణాహుతి, మంగళ శాసనం, శయ్యాదివాసం, జలాదివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు కల్యాణ మహోత్సవం జరగనుందని ప్రధాన అర్చకులు కిషోర్ పంతులు తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, హన్మంత్, నర్సింలు, నారాయణరెడ్డి, పులేందర్, గౌడి వెంకటేశం, రాము, శేఖర్‌గౌడ్, లక్ష్మణ్, గౌడి జయంత్, పండరయ్య, రాకేష్ గౌడ్, సురేష్‌కుమార్, కమిటీ సభ్యులు, వివేకానంద, ఛత్రపతి యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విశ్వ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ అధ్యక్షతన జీపీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య ఉంటే సత్వరమే పరిష్కరించాలని, పైప్ లైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. నీటి సమస్యపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని, విధుల్లో నిర్లక్ష్యం తగదని కార్యదర్శులను హెచ్చరించారు. నిత్యం గ్రామాలకు వెళ్లి, ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. అదే సమయంలో ఉపాధిహామీ పథకం పనులను పర్యవేక్షించి, కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బీజేపీ యాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మర్పల్లి: ఈ నెల 5న నిర్వహించే బీజేపీ ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా.. పెద్దాపూర్ గ్రామం నుంచి యాత్రను చేపడుతున్నామని, దీనికి కొండా హాజరుకానున్నారని వెల్లడించారు. పార్టీ శ్రేణులు అందరూ హాజరై.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు రవీందర్‌రెడ్డి, స్వామి, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తుక్కుగూడలో నిర్వహించే జనగర్జన సభతో కాంగ్రెస్ ప్రచార జయభేరి మోగిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 6వ తేదీన తుక్కుగూడ వద్ద 10లక్షల మందితో భారీ జనగర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోను ప్రకటిస్తుందన్నారు. ఈ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, షాద్‌నగర్ నుంచి సుమారు 15వేల మందితో సభకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, సుదర్శన్‌గౌడ్, కావలి శ్రీశైలం, నర్సింహ్మ, బస్వం, రాజేందర్‌రెడ్డి, అప్పి తదితరులు పాల్గొన్నారు.

'ఆమె' సేవలు అభినందనీయం



మంజుభాషిణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

యాలాల: ఉపాధ్యాయురాలిగా ఆమె సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం బాలుర ఉన్నత పాఠశాలలో మంజుభాషిణి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. చిన్న వయసులో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ఆమె.. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం లేని పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయి, ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారని తెలిపారు. అనంతరం పీఆర్‌యూ, టీపీయూఎస్ తదితర ఉపాధ్యాయ సంఘం నాయకులు టీచర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, మొగులయ్య, సుధాకర్, సంఘం నేతలు పురుషోత్తంరెడ్డి, జైపాల్‌రెడ్డి, తపస్ సంఘం బాధ్యులు లక్ష్మీకాంతరావు, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి

యాలాల: అనారోగ్యంతో బాధపడుతూ మాజీ వైస్ ఎంపీపీ బుధవారం మృతి చెందారు. మండల పరిధి జుంటుపల్లి గ్రామానికి చెందిన జె.రామారావు(55) కొంతకాలంగా అనారోగ్యంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రామారావు 2014 నుంచి 2019 వరకు వైస్ ఎంపీపీగా పనిచేశారు.

కూలీలందరికీ పని కల్పించండి

బంట్వారం: జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద తప్పనిసరిగా పని కల్పించాలని ఎంపీడీఓ రాములు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలంలో సుమారు 5,200 మంది కూలీలు జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, వీరందరూ వంద రోజులు పని చేసేలా చూడాలన్నారు. పని చేసే ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీలు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అదే విధంగా వారికి కూలి డబ్బులు సకాలంలో అందేలా చూడాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ్ కుమార్, ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, టీఏలు అశోక్‌రెడ్డి, జంగయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని టీచర్లు





గిర్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రం (ఇన్‌సెట్లో) చిన్నారులకు ఓనమాలు దిద్దిస్తున్న ఆయా

అంగన్‌వాడీకి తగ్గుతున్న పిల్లల హాజరు శాతం

పెద్దేముల్: అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయుల సమయ పాలన గతి తప్పింది. ఉదయం 8గంటలకు రావలసిన వారు.. 9 గంటలు దాటినా విధుల్లో చేరడం లేదు. ఎవరైనా అడిగితే పొంతనలేని సమాధానం ఇస్తూ.. ఇష్టంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం మండల పరిధి గిర్మాపూర్, గొట్లపల్లితో పాటు పలు సెంటర్లను 'సాక్షి' విజిట్ చేయగా.. పూర్తి స్థాయిల్లో చిన్నారుల హాజరు శాతం తగ్గి కనిపించాయి. గిర్మాపూర్ గ్రామంలో ఉదయం 8.40 గంటలు అయినా టీచర్ రాలేదు. ఆ బడిలో కేవలం నలుగురు పిల్లలే ఉన్నారు. వారికి ఆయానే అక్షరాలు దిద్దిస్తోంది. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కండి

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో ఏడు రోజులుగా ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం చిల్కమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమానికి డాక్టర్ శ్రీలత హాజరై మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు.

'అమ్మ ఆదర్శ' కమిటీల ఏర్పాటు



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

- కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి
- మండల విద్యాధికారి హరిశ్చందర్

పరిగి: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని మండల విద్యాధికారి హరిశ్చందర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు, మున్సిపాలిటీలో మెప్మా వారి సహకారంతో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కమిటీలు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతుందని పేర్కొన్నారు. చైర్ పర్సన్‌గా గ్రామ మహిళా సమాఖ్య వారు, కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయులు ఉంటారని, ఇద్దరితో జాయింట్ ఖతాలు తెరవాలని సూచించారు. ఈ కమిటీల ద్వారానే పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయని వెల్లడించారు. ఎలాంటి సదుపాయాలు కావాలన్నా.. ఆ కమిటీనే సమకూరుస్తుందని వివరించారు.



కుల్కచర్ల: చాకల్‌పల్లితండాలో కమిటీని ఎంపిక చేస్తున్న ఎంపీడీఓ

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి అమ్మ ఆదర్శ పాఠశాలలకు చైర్‌పర్సన్లను ఎంపిక చేశారు. మంగళవారం ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఎంఈఓ హబీబ్ అహ్మద్, మహిళ సమాఖ్య సీసీలు ఆయా గ్రామాలకు చెందిన మహిళా సమాఖ్య గ్రామ సంఘం అధ్యక్షురాలిని పాఠశాల చైర్ పర్సన్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలకు వీఓ అధ్యక్షురాలిని పాఠశాల చైర్ పర్సన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయులను కన్వీనర్‌లుగా నియామక ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యాకమిటీలకు ప్రత్యామ్నాయంగా ఈ వ్యవస్థ పని చేస్తుందని వెల్లడించారు.